నీరసంగా కళ్ళు తెరిచింది అలేఖ్య

ఒకటి.....

రెండు.....

మూడు.....

నాలుగు.....

ఐకచాలు-శైలు ఊచలు లెక్కబెడుతూ ఆపింది. ఇక నాలుగు.....నాలుగే రోజుల్లో అందాల రబ్బరు బొమ్మలాంటి చిన్నారిబాబు....బాబా? పాపా?.... ఊహూ భగవంతుడు తన కోరిక మన్నించి తనకి ప్రసాదించిన వరం.....బుల్లిబాబు పుట్టి తన వెచ్చని పొత్తిళ్ళలో ఆడుకుంటాడు.

బాబు ఎలా వుంటాడో?

అందంగా ఉంటాడా?

ఏమో!

బాబు తండ్రి ఎవరో తనకి తెలిస్తేగా!

తను కోరుకున్నదల్లా ఒక్కటే-అమ్మ కావడం!!

అంత నీరసంలోనూ ఉప్పెనలా నవ్వు ముంచుకొచ్చింది అలేఖ్యకు.

స్కూలులో చేరేటప్పుడు బాబు తండ్రి పేరు ఏం రాయిస్తుంది?

ఆ! దేవుడిపేరు వ్రాయిస్తే?

ఏమని రాయించినా తనెలాగూ సంఘ పరిత్యక్తే.

అరె! జరిగిందంతా మరిచిపోయి యిలా పిచ్చిగా ఆలోచిస్తోందేమిటి? బాబు పుట్టగానే తనని ఈ చట్టం బ్రతకనిస్తుందా?

ఏడుపొచ్చిందామెకు.

తనని అమ్మని కానీకుండా ఎంతమంది ప్రయత్నించారో? అయినా తన ప్రాణాలన్నీ ఒడ్డి బాబుకోసం ఎంతగా పోరాడింది? ఈ చట్టాన్నికూడ ఎదిరించి నిలిచింది.

బాబు పుట్టాక మృణాళిని అక్కలా తనూ వాడి ఒళ్ళంతా ముద్దులతో. ముంచెత్తి......గట్టిగా తన గుండెల కదుముకుంటుంది. వాడు తన చిట్టిచిట్టి పాదాలతో గుండెలమీద తంతోంటే వాడి లేత గుప్పెళ్ళని ముద్దాడుతూ......

తన గుండెల్లోంచి అమృతాన్ని పొంగించి...... వాడిని చిరంజీవిని చేస్తుంది

మళ్ళీ ఆమెను వరదలా దుఃఖం ముంచెత్తింది.

వీళ్ళందరికీ తన బాబుమీద ఎందుకింత కక్ష?

తన బాబు ఎక్కువకాలం బ్రతకడని ఎందుకబద్ధాలు చెప్తున్నారు?

వీళ్ళు. ఈ మనుషులు తనని మోసంచేస్తున్నారు. తన బాబుని కడుపులోనే కరిగించెయ్యాలని ప్రయత్నించలేదూ?

ఆమె చెంపలమీదుగా కన్నీరు ఒలికి గుండెల్లోకి ఇంకిపోతోంది.

జరిగిందంతా అస్పష్టంగా కదుల్తోంది..... కళ్ళముందు

అలేఖ్య!!!

ఈ పేరు ఎవరు ఎప్పుడు పెట్టారో తనకి తెలియదు. బహుశా తనని ఈ నరకంలోకి అమ్మేసిన మనిషి పెట్టిందేమో!

అలేఖ్య .. అంటే... .. వ్రాయబడ నిది .... అని అర్థమట.. ఒకసారి తన పొందుకోరి వచ్చిన రసికుడొకడు తన పేరును మెచ్చుకుంటూ చెప్పాడు

ఉప్పెనలా నవ్వు.

అంటే. ఇంత చరిత్ర వ్రాయిస్తున్న తనకి పేరు

ఎప్పుడు ఎలా వచ్చిపడిందో ఆ నరకంలోకి

తెలిసీ తెలియని వయసులో .... తాటకి ఆ రాక్షసికి తను పెట్టిన పేరు అదే... తాటకి.... పాలు మీగడలతో తన బంగారు దేహానికి వన్నెలు తెస్తుంటే......తన తలకట్టును పట్టుకుచ్చులా పెంచుతూంటే..... "ఎంత ప్రేమో" అని మురిసిపోయింది.

కాని....

బలిపశువును కూడా జాతరకి ముందు అలాగే మేపుతారని తనకి తెలియదు.

మృణాళిని అక్క ఎప్పుడూ విచారంగా అంటూ ఉండే మాటలు చాలకాలం వరకూ తనకి అర్థమయ్యేవికావు

"అలేఖ్యా! నువ్వు ఏ రాజ వంశంలోనో పుట్టి వుంటావే! నీలాంటి సుకుమారిని... ,సౌందర్య రాశిని ... బంగారు తల్లిని ఈ తాటకి....... నరరూప రాక్షసులకు ఆహారంగా వేస్తుందే . ..."

మృణాళిని అక్క ఎక్కువ అందంగా లేకపోయినా ఆమె మనసు ఎంతో అందమైనది. ఆ మనసుపడే క్షోభ తాటకి కెలా తెలుస్తుంది?

అందుకే అక్కకి పుట్టిన పిల్లలు మటుమాయమయ్యేవారు

రెండుసార్లు

మృణాళినికి పుట్టిన బాబు లిద్దరూ పది రోజులకే మాయమయ్యారు. గుండెలవిసేలా అక్క ఏడుస్తుంటే తాటకి నానా తిట్లూ తిట్టేది వాతలు పెట్టేది-కనిపించని చోట.

"వాళ్ళు ఆడపిల్లలయినా బాగుండేదే అలేఖ్యా! మగపిల్లలు వృత్తికి పనికిరారని-తిండి దండగని--చంపించేసిందే!" మృణాళిని ఏడుస్తూ చెప్పిన మాటలు పదునైన బాకుల్లా తన మనసులో గాఢంగా నాటుకున్నాయి.

తనని రొంపిలోకి దింపాక.....

బాగాగిట్టుబాటవడం చూసి . ..

తాటకి ప్రేమ మరీ ఎక్కువైంది.

అదే తనపాలిట శాపం అయ్యింది.

మాతృమూర్తి అయితే తన అందం పాడవుతుందని .. తాటకి తనపట్ల తీసుకునే జాగ్రత్తలు తనకి ఆమెమీద కక్షను పెంచాయి.

అయినా తల్లి కావాలని తనకెందుకింత తపన?

ఏమో?

ఆ కోరిక బీజం ఎప్పుడు పడిందో?

అందుకే తను పెద్దమ్మను మోసంచేసింది

నెల తప్పినట్టు తెలియకుండా తనెన్నిపాట్లు పడినా .. జాగ్రత్తలు తీసుకున్నా ..తాటకి పసిగట్టేసింది.

తన కడుపులోని బాబుని విచ్ఛిన్నం చెయ్యాలని కుట్ర పన్నిన తాటకిని. ఆ మాయలాడిని తన జీవితాన్ని అరచేతిలో కీలుబొమ్మలా ఆడిస్తున్న ఆ వంచకిని.... తన శరీరంతో బంగారు మేడలు కట్టుకోవాలని తపించిపోతున్న రాక్షసిని

కసితీరా.. ...

కసికసిగా

పొడిచి పొడిచి చంపింది

చిక్కని ఎర్రని రక్తం.

ఆశ్చర్యంతో ప్రాణభయంతో నోరు తెరుచుకునే బిగుసుకుపోయిన తాటకి దేహం చూసి కళ్ళుతిరిగి పడిపోయింది

దుష్టశిక్షణ చేసి ఎందరో ఆడపిల్లల జీవితాలకు బంధవిముక్తి కలిగించినందుకు తనని అభినందించాల్సిన చట్టం. తనలాంటి వాళ్ళను నాశనం చేస్తున్నదని తెలిసినా.. తాటకిని ఏమీ చెయ్యని చట్టం..

"ఒక మనిషిని ఉద్దేశపూర్వకంగా చంపడం నేరం"-అంటూ ఈ ప్రపంచంముందు నేరస్థురాలిలా నిలబెట్టింది

"సెక్షన్ 302 ఐ. పి. సి ప్రకారం ఉద్దేశపూర్వకంగా దారుణంగా పంకజాన్ని చంపిన ముద్దాయి అలేఖ్యకు ఉరిశిక్ష విధించడమైనది కాని ముద్దాయి గర్భవతిగా వున్నందున శిక్షను ప్రసవానంతరం వరకు వాయిదా వేయడమైనది"..

మళ్ళీ తెరలు తెరలుగా నవ్వు.... ఎప్పుడు?

తనని మెడికల్ టెస్ట్ చేసిన డాక్టర్-

"మైగాడ్! ఈమెకి ఎయిడ్స్. ...గర్భవిచ్ఛిత్తికి అంగీకరిస్తుందేమో కనుక్కోండి .....ఒకవేళ బిడ్డ పుట్టినా బ్రతకడం కష్టం .. ...బ్రతికితే పసికందుకి కూడా ఎయిడ్స్. ..." అన్నప్పుడు!అయినా- తను ఎవరిమాటా లక్ష్యపెట్టలేదు

చిన్నారి బాబుతో "అమ్మా" అనిపించుకోవాలనేగా హత్యకూడ చేసింది. అటువంటిది బాబును కళ్ళారా చూసే అవకాశమే లేకుండాచేస్తానంటే..... తన ప్రాణంలో ప్రాణాన్ని..... కరిగించి వేస్తానంటే ఒప్పుకుంటుందా? తన జీవితం ఎలాగూ నెలల్లోనే వుంది.

ఎంత ఆపుకున్నా రెండు కన్నీటి బొట్లు చెంపల మీదుగా జారిపోయాయి తను రంగువెలిసిన బొమ్మ. .. మళ్ళీ కొత్త రంగుపులుముకుని తళతళలాడాలని కోరుకోవడంలేదు కాని ఇదేమిటి??

ఎయిడ్స్.......

ఏ మహానుభావుని పుణ్యమో

ఉరిశిక్ష పడకపోయినా తనెలాగూ బ్రతకదన్న మాటేగా...

ఆ భయంకర రోగం గురించి తమకందరికీ క్షుణ్ణంగా తెలుసు

దానిగురించి మొదట తెలిసిన రోజున.... మృణాళిని..... శారద తను చిగురుటాకుల్లా ఒణికిపోయారు.

ఏమో క్రిములు తమ నరనరాల్లో జరజరా




పాకుతున్న జుగుప్సానుభూతితో...... ఎన్నో రోజులు... నిద్రపోలేదు అప్పట్లో......

కాని....

నిజంగానే తనకా వ్యాధి వస్తుందని తెలిస్తే......

అమ్మ కావాలని కోరుకునేదేనా?

ఎందుకాదు?

తన జీవితం క్షణాల్లోనే ఉండనీ–చిన్నారి బాబును కళ్ళారా చూసి....

ఆ లేత చెక్కిళ్ళు తడిమి.....

వాడికి అమృతం పంచి.....

ఎంత ముద్దులు మూటకడుతున్నాడో బాబు?

అయ్యో పసివాడిని ఎంత నిర్దాక్షిణ్యంగా లాక్కుంటున్నారో పోలీసులు.....

అన్నట్టు వ్యాధి నయంచేస్తే తప్ప ఉరితియ్య కూడదటగా– మరి ఈ వ్యాధికి చికిత్సలేదుగా–

ఈ చట్టం ఏం చేస్తుందో?

తన ప్రాణం కాపాడి....తన ప్రాణం తీస్తుందా?

తెరలు తెరలుగా నవ్వు.....

అమ్మో......

తెరలు తెరలుగా నొప్పి.....

తను చచ్చిపోతుందా?.... కాదు... తన బాబు... పోలీసు లు......

అలేఖ్య రెండు చేతులూ పొట్టను గట్టిగా అదుముకుంటున్నాయి. బాధ తట్టుకోలేక.....

ఆమెకి స్పృహ తప్పింది.

"పెయిన్స్" గార్ను పరుగు.....

............

అరుగంటలసేపు అలేఖ్య ఆశల పంటను బయటకు తీసేందుకు డాక్టర్లు చేసిన ప్రయత్నం ఫలించింది.

కాని........

అందరికీ అలేఖ్య ప్రాణం క్షణాల్లో వుందని తెలిసింది. బాబును చూడడంకోసం ఆమె తెగించి మృత్యువుతో పోరాడుతోంది.

"బా......బు......." అతి ప్రయత్నంమీద రెండక్షరాలు ఉచ్చరించి కళ్ళు తెరిచేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది అలేఖ్య.

డాక్టర్ హృదయం కరుణతో కరిగిపోయింది. చిన్న మృతదేహాన్ని...... ఆమె అరు నెలలుగా ఎదురు చూస్తున్న కలల పంటని..... పొత్తిళ్ళలో తీసుకొచ్చి.....ఆమె ప్రక్కలో పడుకోబెట్టాడు.

గాలిలో తడుముకుంటున్న......... ఆమె చేతిని బాబువైపు తిప్పాలని ప్రయత్నించాడు.

కాని.......

అలేఖ్య...... చెయ్యి–మధ్యలోనే క్రిందకి వాలిపోయింది.

ఆ రంగు వెలిసిన బొమ్మ..... హృదయాన్ని ఛేదించుకుని....... ఆమె ప్రాణం..... అనంత వాయువులో లీనమైపోయింది.

అయినా.....

ఆమె కళ్ళు ఎవరినో చూడాలని తపించి పోతున్నట్టు ఆశగా తెరుచుకునే ఉన్నాయి.

ఒకప్పుడు మీనాల్లా చంచలంగా ఎగిరెగిరిపడి కదులుతూ........ రసికుల్ని....... కకావికలు చేసి....... వెర్రెక్కించిన కళ్ళు........ □